కథ


# ది సెల్వ్యాట్

## పొన్నూరి బంటిరామ్

'సండే స్పెషల్' మటన్ కోసం షాప్‌కి వెళ్లాను, అప్పటికే పదిమంది దాకా వున్నారు. పావుగంట తర్వాత నల్లటి పాలిథిన్ కవర్‌ని చేతికిస్తూ ''మేకపోతు'' అని చెప్పాడు, మాకు వాడుకగా యిచ్చే అతను, నా ఒక్కడికే స్పెషల్ అన్నట్లు. తీసుకొని ముందుకి నడుస్తూండగా షాపు వెనక భాగంలో మేకో, పోతో, నెత్తురు ముద్ద, తల తెగి పడివుంది.

ఇంట్లో కూర యిచ్చి ఆటోలో వున్న ఖాకీ షర్టు వేసుకొని పాన్‌పరాగ్ చించబోతుండగా ''ఆటో!వస్తావా?'' పిలుపు.

భవానిపురం అయిరన్ యార్డులో ప్యాసింజర్లని దింపి వెనుదిరిగాను, రిటన్ కిరాయి పడలేదు, ఆదివారం అవడం వల్ల రోజు వుండే రద్దీలేదు, బైపాస్‌లో. సొరంగం నుండి పాల ఫ్యాక్టరీ వైపు వెళ్దాం అనిపించింది. తెల్లవారు ఝామున పడిన కొద్ది వర్షానికి రోడ్లు చిత్తడి చిత్తడిగా వున్నాయి. పళ్ళు లాగుతున్నాయి పాన్ పరాగ్ కోసం.



టీ పడితే కాని బండి కదిలేలా అన్పించలేదు, రోడ్డు వారగా ఆపాను...బద్దకంగా ఆటో దిగి వొళ్ళు విరుచుకుంటున్న సమయంలో, నాదృష్టి చుట్టు పక్కల పరిసరాల మీద పడింది. కార్పోరేషన్ వాళ్లు చెత్త తెచ్చి రోడ్డుకి ప్రక్క ప్రాంతంలో పడేసారు..

చిన్న బడ్డికొట్టు సిగరెట్లు వగైరా,బల్ల మీద టీ ఫ్లాస్కు, ప్రక్కనే జ్యూస్ బండి కుర్రాడు బత్తాయిలు సర్దుతున్నాడు. రోడ్డుకు అటుపక్క కొంచెం దూరంలో రిలయన్స్ ఫ్రెష్ గోడౌన్, జేబులోంచి పాన్‌పరాగ్ తీసి పళ్ళతో కొరుకుతుండగా చూసాను! నేను వున్న దగ్గరికి 5 గజాల దూరంలో కుక్క కళేబరం రోడ్డుకి ఓ ప్రక్కన నేను చూస్తుండగానే ఓ ట్రాక్టర్ దాని పక్కగా పోయింది.

'' అయ్యో! '' అన్న పలుకు అప్రయత్నంగా, నా నోటివెంట గబగబా... నా కాళ్ళు, అటువైపు నడిచాయి... కుక్క చాలా బలంగా వుంది, నోటి వెంట వచ్చిన నెత్తురు రోడ్డు మీద జాలుగా కారిపోయింది. చూస్తున్నాను....

చూస్తుండగా, నా బుర్రలో ఏవో ముద్రలు, కళేబరం అవును, మేక కళేబరం, కుక్క కళేబరం, రెండు ప్రక్కప్రక్కగా డబుల్'ప్రొఫైల్' ఆకృతి పాన్ పరాక్ వేళ్ల మధ్యనుంచి జేబులోకి వెళ్లిపోయింది. వెనుదిరిగాను, తూర్పు యాసతో ''రాత్రి నారి గుద్దేసింది.'' బత్తాయిలు సర్దుతున్న కుర్రాడు అన్నాడు.

బడ్డి ఆమె డిస్‌పోసబుల్ గ్లాసులో టీ ఇచ్చింది. వేళ్ళు చురుక్కుమన్నాయి. టీ సహించేటట్లు అన్పించలేదు. కుక్కను చూసిన తరువాత కడుపులో దేవినట్లు అన్పించింది. ఇక్కడ కుక్క, అక్కడ మేక, టీ బల్ల మీద పెట్టాను చల్లటి గాలి ఝుం ఝుం అని శబ్దం చేస్తోంది.

....సమయం గడిచిపోతుంది. అంతలోనే టీ చల్లారిపోతుంది అన్పించింది, అంతే కాదు ఇలాంటివి మామూలే కదా అనికూడా అన్పించింది. నా చేయి టీ గ్లాసు అందుకుంది.

★★★

ఎవరో? మోటార్‌బైక్ ఆసామి, కుక్క కళేబరం దాటుకొని వెళ్ళిపోయి అంతలోనే బైక్‌ని వెనక్కి తిప్పాడు, కుక్క దగ్గరికి వచ్చి హెల్మెట్ తీసి క్షణ కాలం పరికించి, అక్కడ్నుంచి మేం వున్న వైపు వచ్చి బైక్‌స్టాండ్ వేసి జ్యూస్ బండి కుర్రాడ్ని పలకరించి కుక్కవైపు చూపిస్తుండగా, ఆయన ఏమి అడగబోతున్నాడో గ్రహించిన జ్యూస్‌బండి కుర్రాడు నాకు చెప్పిందే ఆయనకు చెప్పాడు.

ఆయన కొద్ది నిముషాలు చుట్టూ పరికించి, రోడ్డు దాటి చెత్తనిండి వున్న ప్రదేశం వైపు వెళ్ళి కొద్ది సమయం తరువాత వెనుదిరిగారు.

చెట్ల క్రింద ఇద్దరు అబ్బాయిలు, 15,14 మధ్య వయసున్న వాళ్ళు, రోడ్ల మీద ఏరుకొచ్చిన చెత్తని సంచిల్లోంచి గుమ్మరిస్తున్నారు. మరో ఇద్దరు ఆ కుప్పల్లోంచి వాటిని రకరకాలుగా వేరు చేస్తున్నారు. ఈయన తిన్నగా అక్కడికి వెళ్ళి కుక్క వైపు చూపిస్తూ ఏదో మాట్లాడారు వాళ్ళతో.

ఆయనా, ఓ అబ్బాయి కుక్క కళేబరం వద్దకు వెళ్ళారు, ఆ అబ్బాయి అంటున్నాడు, కాళ్లుపట్టుకుని ఈడ్చేద్దాం! అని ఆయన వద్దన్నట్లు సైగచేసి, పేపర్ని కుక్క కళేబరం తల మీద వుంచి ఓ చేయి తలక్రింద,మరో చేత్తో కాళ్లు పట్టుకొన్నారు. ఆ అబ్బాయి, వెనుక భాగం, దాన్ని రోడ్డుకి ఆవలి భాగంలో పొదల్లో దించారు. ఆ కుర్రాడు వెనుదిరిగాడు. ఈయన ప్రక్కన చెవున్న వెంపల మొక్కల్ని పీకి కళేబరం మీద వెయ్యసాగారు. ఇది చూసిన అబ్బాయి అదే పని చేసాడు. కళేబరం చెట్లలో కల్సిపోయింది.

ఈయన తన బైక్ దగ్గరకు వచ్చారు, జ్యూస్ బండి కుర్రాడు ఆయన అడక్కుండానే నీళ్ళు ఇచ్చాడు. చేతులు తుడుచుకున్న ఈయన కుక్క కళేబరాన్ని అక్కడినుంచి తీసివేయడానికి తోడు వచ్చిన అబ్బాయికి పది రూపాయలు ఇచ్చారు.

★★★

రోడ్డు మీద కుక్క కళేబరం, దారిన పోయే ఎవరో చూడడం, అతను ఇవన్నీ చేయడం, నా బుర్రకు కొత్తగా అన్పించింది. జరుగుతున్నది,జరిగింది, చూడడంలో మిగిలిన ఇద్దరితో వున్న నాకు–ఉరుములేని పిడుగు ధ్వనిలా, విన్పించింది ఓ కంఠం... అవాక్కయ్యాను.

రిలయన్స్ గేటు వద్ద సెక్యూరిటీ అతను వచ్చి రావటంతోనే ''ఏంటీ? దాన్ని అక్కడ పడేశారు, వాసన భరించలేం తీసి దూరంగా తీసుకెళ్ళండి.'' అసహనంగా అన్నాడు..

ఈయన సెక్యూరిటీని చూస్తూండిపోయారు... కొద్ది క్షణాలు

''ఇదేమన్నా గొప్ప దేశసేవ అనుకుంటున్నారా? మీ దారిని మీరు పోతారు, దుర్వాసన భరించలేక చచ్చేది మేము.''

''మునిసిపాలిటి వాళ్లు చూసుకుంటారు, మీకేం పని, వాళ్ళే తీసుకెళ్లి ఎక్కడో పడేస్తారు మీదారిని మీరు పోక, మీకెందుకండి యిది.''

''అది...కాదు...''

''ఏది కాదు, కుదరదు. మా ఆఫీసర్లకి నేనేం చెప్పాలి, నువ్వేం చేస్తున్నావంటారు.''

ఆయన చెప్పేది వినిపించుకోవడం లేదు, సెక్యూరిటీ అతను

''ఇక్కడ దోమల్తో, మురుగుతో ఛస్తున్నాం. ఇది చాలదు అన్నట్లు దాన్ని అక్కడ పడేశారు.''

ఈయన ఏం మాట్లాడలేక పోతున్నారు, ఒకటి రెండు సార్లు టైము చూసుకున్నారు.

కొద్ది సమయం మా అందరి మధ్య నిశ్శబ్దం రాజ్యమేలుతుంది. చెట్లక్రింద నుంచి మరో యిద్దరు వచ్చి మాతో కలిసారు. అందరూ చోద్యం చూస్తున్నట్లు చూస్తున్నాం.

ఇప్పుడేం జరుగుతుంది? ఏదో జరిగిపోద్దని కాదు... అసలు?

''టీ యివ్వమ్మా'' అన్నాడు సెక్యూరిటీ బడ్డీ కొట్టు ఆమెతో.

ఈయన ముఖ కవళికలు ఏదో ఆలోచిస్తున్నట్లనిపిస్తుంది. చటుక్కున చెట్ల కింద ఉన్న, చెత్త గుట్టలవైపు వెళ్ళిన ఆయన, అటు ఇటు వెదకసాగారు. క్షణాలు దొర్లిపోతున్నాయి. ఆయన స్థిమితంగా వెనుదిరిగారు, చేతిలో లావుపాటి ఇనుపసువ్వతో,

ఆయన కుక్కని వుంచిన వైపు వెళ్తుండగా, ఇంతకుముందు ఆయన వద్ద డబ్బులు తీసుకున్న అబ్బాయి ఆయన్ని అనుసరించాడు.. కొద్ది సమయం తరువాత నేను కూడా వెళ్ళాను. అప్పటికే ఆయన చెత్తను తొలగించి గొయ్యి తవ్వడం చేస్తున్నారు. వర్షం వల్ల మెత్తబడిన నేలతల్లి పెళ్ళలుపెళ్ళలుగా పూడిచేతికి వచ్చేస్తుంది. చూస్తుండగానే కుక్కను పూడ్చడానికి కావాల్సిన గొయ్యి యేర్పడింది. ఈయన యంత్రంలాగా పని చేస్తున్నారు.

కుక్క కళేబరాన్ని వుంచిన దగ్గరనుంచి తీసి గోతిలో వుంచి, ఆకులు చెత్త వేసి పైన మట్టిని నెట్టేశారు.

ఎంత వేగం! ఆశ్చర్యం కలిగింది నాకు! మట్టి చేతులు గబగబా శుభ్రం చేసుకుని.... టైముచూసుకుంటూ, బైక్ వైపు కదిలారు. చేష్టలుడిగిన సెక్యూరిటీ, ఆయన బైక్ మీద వున్న సమయంలో పూనకం వచ్చినట్లు..''సర్...'' అంటూ సెల్యూట్ చేశాడు, బైక్ కదిలింది. నేను కూడా ఆయనకి అప్రయత్నంగా సెల్యూట్ చేశాను.

★

